క్లుప్తంగా

నేరాల మూల కారణాలపై లోతైన అవగాహన అవసరం

చేబ్రోలు: పేదరికం, విద్య మరియు సామాజిక అసమానత వంటి సమస్యలను పరిష్కరించడం, నేరాలకు మూల కారణాలపై లోతైన అవగాహన అవసరమని ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ అనూప్ సురేంద్రనాథ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో అస్సెసింగ్ ద న్యూ క్రిమినల్ లా బిల్స్ ఏ క్రిటికల్ అప్రోచ్ టు క్రిమినల్ లా రిఫార్మ్ అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అనూప్ సురేంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ న్యాయ సంహిత, 2023 (కొత్త శిక్షా బిల్లు), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, 2023 మరియు భారతీయ సాక్ష్యా బిల్లు, 2023 ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. సమాజంలో నేరాల నియంత్రణకు చట్టం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అది అన్ని సామాజిక సమస్యలను పరిష్కరించదని గుర్తించడం చాలా అవసరమని చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, న్యాయ నిపుణులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

29న నూర్‌బాషాల సింహగర్జన

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కళాశాల మైదానంలో సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఖాజావలి, నగర అధ్యక్షుడు షేక్ ఆదాం షఫీ, వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ స్టార్ మస్తాన్‌లు తెలిపారు. శనివారం గోరంట్లలోని వుడ్‌లాండ్ హోటల్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ సభ 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘీయులు 20 లక్షల మంది వరకూ ఉన్నారని ఇంతవరకు ఏటువంటి రాజకీయ గుర్తింపు ఇవ్వలేదన్నారు. ఈ నెల 29న జరిగే సదస్సుకి రెండు లక్షల మంది తమ సంఘం ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. అనంతరం సింహగర్జన సభ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. డాక్టర్ మస్తానమ్మ, కార్పొరేటర్ షేక్ మీరావలి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పెదకాకాని శివాలయంలో వేడుకలు ప్రారంభం
- దసరా ఉత్సవాలకు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ముస్తాబు


పెదకాకాని శివాలయం

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయానికి విద్యుత్ అలంకరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ ఉత్సవాలు ఈనెల 15వ తేది నుంచి 23వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. 9 రోజుల పాటు అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావులు తెలిపారు. శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీ ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నవత్రోత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం భ్రమరాంబ అమ్మవారు విశేష అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 10 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, నవావరణ పూజలు జరుగుతాయన్నారు. అర్చకస్వాములు ఉభయదాతలచే పూజలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 5 గంటలకు శ్రీభ్రమరాంబ అమ్మవారికి కుంకుమార్చనలు, 6 గంటలకు హారతులు, ఆలయ ప్రదక్షిణ, తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతుందని వివరించారు.

శివాలయంలో రాహుకేతు పూజలు

పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రాహుకేతువు పూజలు జరిపించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ప్రత్యేకంగా టెంట్‌లు ఏర్పాటు చేశారు. శనివారం ఒక్కరోజు 973 మంది రాహుకేతు పూజ టిక్కెట్లు కొనుగోలు చేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ టిక్కెట్ల ద్వారా రూ.4,86,500 ఆదాయం దేవస్థానానికి సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్‌రావు తెలిపారు. అన్నప్రసాద వితరణకు పెద్ది సూరి ప్రకాష్, దుర్గమ్మ దంపతులు విరాళం సమర్పించినట్లు తెలిపారు.

పక్షుల పరిరక్షణ అందరి బాధ్యత

పెదకాకాని: ప్రకృతి సంపదను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐఎఫ్ఎస్, ఏపీ సీసీఎఫ్ వైల్డ్ అండ్ డైరెక్టర్ ఆఫ్ జూస్ డాక్టర్ శాంతిప్రియ పాండే అన్నారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి కార్యాలయంలో శనివారం వరల్డ్ మై గ్రేటరీ బర్డ్స్ దినోత్సవం సందర్భంగా ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రం స్పెషల్ పోస్టల్ ఎన్వలప్ కవర్ ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ శాంతి ప్రియ పాండే విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి ప్రియ పాండే మాట్లాడుతూ పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సీజన్‌ల వారీగా వలస పక్షులు ఉప్పలపాడు పక్షుల కేంద్రానికి రావడం గుడ్లు పెట్టి పిల్లల్ని చేసి తిరిగి అవి వచ్చిన ప్రాంతానికి వెళ్లడం జరుగుతూ ఉంటుందన్నారు. ఎప్పుడు చూసినా 10 వేల పక్షులతో కళకళలాడుతూ ఉంటుందన్నారు. ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రం స్పెషల్ పోస్టల్ ఎన్వలప్ కవర్ విడుదల చేయడం ద్వారా మరింత గుర్తింపు లభిస్తుందని, మంచి పర్యాటక కేంద్రంగా మారుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ డీఎస్‌వీఆర్ మూర్తి, గుంటూరు ఐఎఫ్ఎస్, సీసీఎఫ్ వై.శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి కె.మహబూబ్ బాషా, ఉప్పలపాడు పక్షుల కేంద్రం చైర్మన్ పెరుమాళ్ళ అనిల్ కుమార్, డీఆర్ఓ వి వెంకటేశ్వరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.సంతోష్‌కుమార్, గుంటూరు డివిజన్ అటవీశాఖ సిబ్బంది, విజయవాడ పోస్టల్ శాఖ సిబ్బంది హాజరయ్యారు.

మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ఘన సన్మానం



పెదనందిపాడు: ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారికి స్వర్ణ భారతి ట్రస్ట్ తరఫున భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు సత్కరించారు. శనివారం రైతు నేస్తం వ్యవసాయ మాసపత్రిక 19వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవసాయ రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గానూ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.జగత్ శ్రీనివాస్‌కు కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూర్‌లోని స్వర్ణ భారతి ట్రస్టు ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతని, అటువంటి రైతులకు సేవ చేయడం చాలా అదృష్టమని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్.జగత్ శ్రీనివాస్‌ను సన్మానించారు. స్వర్ణభారతి ట్రస్టు సభ్యులు, రైతునేస్తం సభ్యులు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గాలో అన్న సంతర్పణ

పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులందరికీ శనివారం రాత్రి అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. గతంలో బాజీబాబా దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ప్రతి అమావాస్య రోజున రాత్రి సమయంలో దర్గాకు వచ్చిన భక్తులకు భోజనం ఏర్పాటు చేయాలని అందుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో శనివారం రాత్రి దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది.

అసైన్డ్ భూమిలో అక్రమ క్వారీయింగ్

బీఎన్‌పాలెంలో సాగు భూమిని కాపాడాలంటూ దళితుల నిరసన దీక్ష

వీరనాయకునిపాలెం(చేబ్రోలు): ప్రభుత్వం పేదలకు అందించిన అసైన్డ్ భూమిలో సాగు చేసుకుంటున్న దళిత రైతు కుటుంబానికి చెందిన భూమిని క్వారీ నిర్వాహకులు తవ్వకాలు చేస్తుంటంపై శనివారం నిరసన దీక్ష చేపట్టారు. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామంలో సాగు చేసుకునేందుకు గ్రామానికి చెందిన 60మంది నిరుపేద దళితులకు 30 ఎకరాల సాగు భూమిని 1995లో ప్రభుత్వం అందించింది. సర్వే నెంబరు 494, 495, 498, 499, 501 ,370, 371, 374 తదితర నెంబర్లలో పేదలకు ఒక్కొక్కరికి అర ఎకరం చొప్పున పంపిణీ చేసింది. వీటిలో ఎక్కువ భాగం క్వారీయింగ్ జరిగింది. సర్వే నెంబరు 499బై 1బిలో పెనుమాక వెంకటేశ్వరమ్మ భర్త మంగయ్యకు 49 సెంట్ల భూమిని ప్రభుత్వం ఇచ్చింది. దీంతో పాటు దీని పక్కనే ఉన్న ఎకరం మెట్ట భూమిని కూడా గత 35సంవత్సరాలుగా పెనుమాక దాసు వారి కుటుంబసభ్యులు సాగుచేస్తున్నారు. దీనిలో కంది, జొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగు నీరు సక్రమంగా అందకపోవటంతో పంట ఎండిపోయింది. ఈ తరుణంలో ఈ నెల 8వ తేదీన పెనుమాక దాసు సాగు చేస్తున్న భూమిలో కొంత భాగాన్ని క్వారీయింగ్‌కు అనుమతులు ఉన్నాయంటూ మంగళగిరి ప్రాంతానికి చెందిన రవికుమార్ అనే అతను తవ్వకాలు చేపట్టారు. దీనిని దాసు, అతని కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. దీనిపై చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ కె.ఆనంద్‌కు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు బాధిత కుటుంబసభ్యులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాలకు చెందిన వారి రికార్డులను తీసుకురావాలని అప్పటివరకు తవ్వకాలు చేపట్టవద్దని తహసీల్దార్ ఆదేశించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పెనుమాక దాసు శనివారం సాగు భూమిలో ఫ్లెక్సీ పెట్టుకొని గుడారం వేసి నిరసన దీక్షను చేపట్టారు. పెనుమాక దాసు, నాగేశ్వరరావు, గంగాధరరావు, గోపి, మరియమ్మ, శ్రావణి తదితరులు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. సాగు భూమిని ధ్వంసం చేసిన రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్లపాటు మైనింగ్ చేసుకునేందుకు 2019లో అప్పటి తహసీల్దార్ పి.ప్రభాకర్ సూచనల మేరకు మైనింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వం 49 సెంట్లు పట్టా ఇచ్చినట్లు దాసు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరువురికి చెందిన రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు వాస్తవ నివేదికను పంపనున్నట్లు తెలిపారు.

525 మందికి వైద్య పరీక్షలు


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రతయ్య

పెదనందిపాడు: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, పెదనందిపాడు రోటరీ క్లబ్, కాటూరి వైద్య కళాశాల హాస్పటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 525 మందికి వైద్య పరీక్షలు నిర్వహిచినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు వై.కోదండ రామిరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక అశోక పాఠశాలలో నిర్వహించిన శిబిరాన్ని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో రోటరీక్లబ్ కార్యదర్శి వై.రమణయ్య, సభ్యులు ఎస్‌వీఎస్ నాగేశ్వరరావు, గుడూరి వీరయ్య చౌదరి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీవీఐటీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నూతనంగా ప్రవేశాలు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. నంబూరు వీవీఐటీలో శనివారం కళాశాలలోని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ వేడుకల ద్వారా 2023–27 విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, గీతాలు అలరించాయి. ఇంజినీరింగ్ చదువులు మాత్రమే కాదు గొప్ప అనుభూతి అంటూ రూపొందించిన నాటకం ఆకట్టుకుంది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు వీవీఐటీ కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

